## 19

# కింగ్ మేకర్

అనగా అనగా ఓ మనిషి. అతను వీధిలో కొచ్చాడు. ఇంత మట్టి చేతులోకి తీసుకున్నాడు. అది డబ్బుగా మారింది.

ఎవడో ఒకడు కొత్తగా పరిచయమయ్యాడు. 'హలో' అని వాడితో చేయి కలిపాడు. వాడు డబ్బై కౌగలించుకున్నాడు. సరదాగా పరమ చెత్త సినిమా తీశాడు. దురదృష్టవశాత్తు అది వంద రోజులాడింది? వంద లక్షలు తెచ్చి పెట్టింది. డబ్బు తగలేద్దామని బార్లోకెళ్లి గుఱ్ఱమెక్కాడు. రేసుకోర్సులో తేలాడు. డబ్బు కాసిన గుఱ్ఱాలన్నీ డబ్బులై సకిలించాయి. ప్రభుత్వం వారికి ఏదో ఓ ఖర్చు చూపెట్టాలని ప్లాన్ వేశాడు. సంక్రాంతి వస్తోంది కదా అని ముగ్గుల పాకెట్లమ్మాడు. అవి బ్లాకులో అమ్ముడయ్యాయి. ముగ్గుల ఫ్యాక్టరీ ముయ్యడానికి వీల్లేదని, గిరాకీ బాగా ఉందని, పనివాళ్ళంతా చేతులు కట్టుకుని కూచున్నారు! మనిషికి తల తిరిగింది.

మనిషి, పత్రిక పెడతానని బెదిరించాడు. పాఠకులు చప్పుడు చేయలేదు. వారి నిశ్శబ్దం మనిషికి అర్థం కాలేదు. ఈ రకంగా తప్పక చేతులు కాల్చుకోవచ్చని ధీమాగా పత్రిక పెట్టాడు. ప్రజలు ఎగబడి కొన్నారు. పత్రిక ఏదీ, ఏదీ అని పాఠకులు గంగవెఱ్ఱు లెత్తారు. సరదాగా ప్రజాసేవ చేద్దామనుకున్నాడు. డబ్బులు పంచి పెడదామనుకున్నాడు. పెట్టాడు. బీదాసాదా అంతా 'జై జై' అన్నారు.

ఓసారి, ఒక చోట కుమ్ములాట జరుగుతోంది. ఒక సీటుకోసం పదిమంది హోరాహోరీ పోరాడుతున్నారు. ఆ సీటు మామూలు సీటు కాదు - అధికారం సీటు!! మనిషి డబ్బు గలగలా గుమ్మరించాడు.

కుమ్ములాట లోని వాళ్ళంతా ఏరుకోవడం ప్రారంభించారు. అక్కడ సీటు ఖాళీ అయ్యింది. మనిషి ధీమాగా వెళ్లి కూచుందా మనుకున్నాడు. అంతరంగికు డొకడు వచ్చి చెవి కొరికాడు. "సార్! ఆ సీటుమీద కూచున్నారా ప్రమాదం, కాలు కదపకుండా, నోరు విప్పకుండా మిలియన్లలో డబ్బు వచ్చి పడుతుంది. ఆలోచించుకోండి" అని అన్నాడు.

మనిషి గొప్ప విచారంలో మునిగిపొయ్యాడు. కుక్కలాగుండే విశ్వాస పాత్రుడు, ఒకడు కాళ్ళదగ్గర కనిపించాడు. మనిషి వాడి జుట్టు పట్టి లాగాడు. లేపి నిలబెట్టాడు.

"తలంటుకురా ఫో నీకు పట్టాభిషేకం చేస్తాను" అని అన్నాడు.

మనిషి జీవితంలో దేన్నో అన్వేషిస్తూ దేనికోసమో బతుకుతూనే ఉన్నాడు. ○

ఫిబ్రవరి 1992